





netisudiksha.online

# నేటి సుదీక్ష

సమాజానికి సరైన దృక్పథం

SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న నేటి సుదీక్ష దినపత్రికలో,బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 7288033333



హనుమకొండ సంపుటి 01 సంచిక 79 బుధవారం ,ఆగస్టు 12, 2026 , పేజీలు - 4 వెల : 2.00 PRGI NO : TGTEL/26/A3170


## మా డిమాండ్లలో
# ఎలాంటి మార్పు లేదు



**న్యూ ఢిల్లీ :**పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. విపక్షాలు తమ డిమాండ్లను మార్చులేదని అన్నారు. విద్యార్థులపై పోలీసుల చర్య, రామ మందిర విరాళాల వ్యవహారం, ప్రభుత్వ క్షమాపణ వంటి మూడు అంశాలపై తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వం పార్లమెంట్?లో స్పష్టమైన ప్రకటన చేసే వరకు వాటిని లేవనెత్తుతామని తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఖర్గే ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. “మేం మా లక్ష్యాన్ని మార్చుకోవడం లేదు. మొదటి నుంచే మా వైఖరి ఒకటే. మూడు నిర్దిష్ట అంశాలపై మేం సమాధానం కోరుతున్నాం. మొదటి అంశం విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జి, కాల్పులకు సంబంధించినది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు అవి ఎలా తెలుసుకోవాలన కుంటున్నాం. దీనిపై సభలో సమాధానం కావాలి. లాఠీఛార్జి వల్ల పలువురు విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో పాలయ్యారు. 100 మందికిపైగా స్వల్పంగా గాయపడ్డారు. మరికొందరికి పెల్లెట్ గన్? గాయాలయ్యాయి. ఈ విషయంపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరుతున్నాం. ఘటన జరిగి 18 రోజులు గడిచినా పూర్తి స్థాయి సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. వారు కేవలం ఓ చిన్న ప్రకటన చేసి అంశాన్ని ముగించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. విద్యార్థులపై పోలీసుల చర్యతో పాటు రెండోది రామ మందిర విరాళాల చోరీ. ఇక మూడోది, క్షమాపణలు చెప్పాలి. ఈ మూడు డిమాండ్లు మొదటి నుంచే ఉన్నాయి. ఇప్పటికి కొనసాగుతున్నాయి. పరిష్కారం లభించే వరకు వాటిని విపక్షాలు లేవనెత్తుతాయి”అంతకుముందు పార్లమెంట్ ప్రాంగణంలో ఝార్ఖండ్? విద్యార్థుల ఆందోళనపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఝార్ఖండ్‌లో నిరసన చేస్తున్న విద్యార్థులను కలిశారని తెలిపారు. అలాగే ఎన్‌డీఏ ఎంపీలు చేసిన నిరసనపై స్పందిస్తూ, పార్లమెంట్ ప్రాంగణంలో ఇలా చేయడం మొదటిసారి చూస్తున్నానని వ్యాఖ్యానించారు.

## పంజాబ్‌లో ‘జాంబీ డ్రగ్’ రాజకీయ దుమారం



**పంజాబ్:** బీజేపీ రాజ్యసభ ఎంపీ, మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ పంజాబ్‌లో డ్రగ్స్ సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ చేసిన పోస్టు పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ప్రచారంలో ఉన్న వీడియో పంజాబ్‌కు చెందినది కాదంటూ హర్భజన్ సింగ్‌పై ఆప్ విరుచుకుపడుతోంది. ఈ దృశ్యాలు రాజస్థాన్‌కు చెందినవని పోలీసులు ఫ్యాక్ట్ చెక్ చేశారు. ఇదిలా ఉండగా, ఆ వీడియోలో ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై వింతగా, కదలిక లేకుండా నిలబడడంతో సోషల్ మీడియాలో ఇది వైరల్?గా మారింది. ఈ క్రమంలోనే స్పందించిన పలువురు నెటిజన్లు వీరిద్దరూ ‘జాంబీ డ్రగ్’ ప్రభవంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. జాంబీ డ్రగ్ విస్తృతంగా ప్రచారం అవుతోంది.

## పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే
# కఠిన చర్యలు



**హైదరాబాద్, ఆగస్టు 11:** పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు పత్తి అమ్మే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 2026–27 సీజన్‌లో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా వేశామని తెలిపారు. (మంగళవారం) సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తిని అంచనా వేస్తున్నామని చెప్పారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు రూ.8,667 ఎంఎస్పీ ధర ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.557ల ఎంఎస్పీ ధర పెరిగిందని తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు 122 నుంచి 131కు పెంచారని వెల్లడించారు. తెలంగాణలో 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. 15 నుంచి 30 రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రైతుల ప్రతినిధులతో జిల్లా మానిటరింగ్ ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో బీభత్సం
## భారీ వర్షాలకు 157 మంది మృతి



**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇప్పటివరకు 157 మంది మృతిచెందగా.. 257 మంది గల్లంతయ్యారు. జూన్ 30 నుంచి ఆగస్టు 9 మధ్య కాలంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి కారణాలతో ఏకంగా 68 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 89 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు దాదాపు 900 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.886 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం వెల్లడించింది.మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫ రాకు తీవ్ర అంతరాయం ఏర్పడి ంది. ముఖ్యంగా కుల్లు, మండి జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమ య్యాయి. సుమారు 161 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) వారం రోజులుగా పని చేయడం లేదు. వీటిలో అత్యధికంగా మండిలో 77, సిమ్లాలో 43, కుల్లులో 40 డీటీఆర్‌లు పని చేయకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాల కారణంగా ఏటా కురిసే భారీ వర్షాల మాదిరి గానే ఈ ఏడాదీ వానలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా కుల్లు అంతటా నదులు, వాగుల్లో నీటిమట్టాలు అకస్మాత్తుగా పెరిగాయి. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు ముంచెత్తడం వంటి భయంకరమైన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

## రద్దీకి తగ్గట్లుగా కొత్త కోచ్‌ల కొనుగోలు,
# ఓల్డ్ సిటీ పనుల్లో వేగం

- మెట్రో రివ్యూలో రేవంత్ రెడ్డి ఆదేశం
- మెట్రో రైలుపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- మెట్రో రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ చర్చ



**హైదరాబాద్:** మెట్రోరైలు రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్‌పై ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మెట్రో రైల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు.మెట్రో రైల్‌కు అదనపు బోగీలు : ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఏడున్నర కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్?లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని చెప్పారు. మెట్రో విస్తరణకు కోసం పెండింగ్?లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రోజురోజుకు పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్?కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. మెట్రో రైల్ కోచ్‌లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్లోబల్ సమ్మిట్?పై అధికారులతో చర్చ : మెట్రో రెండో ఫేజ్?లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు ఏడున్నర కిలోమీటర్ల కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. డిసెంబర్?లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై కూడా అధికారులతో రేవంత్ రెడ్డి చర్చించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్?లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.

## పేద పిల్లల కలలకు చిరునామాగా..
# యంగ్ ఇండియా స్కూల్స్




**హైదరాబాద్, ఆగస్టు 11:**

తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు.సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్.భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుది ద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవ భారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి’ అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## రేవంత్‌రెడ్డి షెల్ కంపెనీల బాగోతాన్ని
# బయట పెడతాం



**హైదరాబాద్, ఆగస్టు 11 :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు () సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయట పెడతామని హెచ్చరించారు. (మంగళవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెక్రాస్ట్ (ఎవంతీఖుష్) సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపె నీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెక్రాస్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు.

## ప్రతికూల పరిస్థితుల్లోనూ 10.7 శాతం సానుకూల
# ఆర్థిక వృద్ధిరేటు



**అమరావతి, ఆగస్టు 11:**రాష్ట్రం ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ 10.7 శాతం సానుకూల ఆర్థిక వృద్ధిరే టు సాధిం చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర వృద్ధిరే టును 15 శాతా నికి తీసుకెళ్లేలా ప్రతి ప్రభుత్వ శాఖ వనరు లను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దిష్ట లక్ష్యాలతో ప్రణాళికలు రూపొంది ంచాలని అధికారులను ఆదేశించా రు. క్షేత్రస్థాయి వరకు సమాచా రాన్ని సమగ్రంగా విశ్లేషిస్తూ, సామాన్యుడిపై ఎలాంటి ధరల భారం పడకుండా తగిన కార్యాచరణ చేపట్టాలని సూచించారు.జులై 2026 నెలవారీ నివేదికను ప్రణాళిక శాఖ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సచివాలయంలో అందచేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదైనప్పటికీ స్థూల ఉత్పత్తి పడిపోకుండా అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. వాణిజ్య పన్నుల శాఖ తరహాలోనే ప్రతి ప్రభుత్వ శాఖలోనూ అత్యాధునిక టెక్నాలజీని అనుసం ధానించి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

# ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత
- హనుమకొండ కేడీసీలో ఘనంగాహర్ ఘర్ తిరంగా' కార్యక్రమం

**హనుమకొండ, ఆగస్టు 11 (సుదీక్ష న్యూస్) :** రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు దేశ అభివృద్ధిలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ () వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'పై నిర్వహిస్తున్న రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం (×జూ్రా), ఫొటో ఎగ్జిబిషన్‌ను మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ప్రారంభించారు.
ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా, సీబీసీ రూపొందించిన జాతీయ పతాకం ప్రస్థానం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హక్కుల కోసం పోరాడటం ఒక నాణేనికి ఒక వైపు మాత్రమేనని, మరోవైపు పౌరుల బాధ్యతలను కూడా గుర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మనకు లభించిన స్వాతంత్ర్యానికి గౌరవం, విలువ ఇస్తూ భవిష్యత్ తరాలకు ఎలాంటి సమాజాన్ని అందించాలన్నది మన చేతుల్లోనే ఉందన్నారు. దేశ



అభివృద్ధి, భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, యువత తమ జీవితాలను ఎలా మలుచుకుంటారనేది వారి చేతుల్లోనే ఉంటుందని చెప్పారు. కష్టపడి పనిచేసి తమ జీవితాలను మెరుగుపరుచుకోవడంతో పాటు దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

### స్వేచ్ఛను కాపాడుకోవాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం కోసం జరిగిన త్యాగాలు, పోరాటాల జ్ఞాపకాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని సూచించారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మన అదృష్టమని, ఇంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం గొప్ప అవకాశమని అన్నారు. రాజ్యాంగం మనకు ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులను కల్పించిందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని, జనవరి 26న గణతంత్ర దినోత్స వాన్ని ఘనంగా జరుపుకుం టామని, స్వాతంత్ర్యం వెనుక ఉన్న కృషి, త్యాగం, పోరాటాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నేడు మనం చూస్తున్న జాతీయ పతాకం ఒక్క రోజులో రూపుదిద్దుకున్నది కాదని, దాని వెనుక ఎన్నో సంవత్సరాల కృషి, పోరాటాలు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మనకు లభించిన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య వ్యవస్థను కృతజ్ఞతతో గుర్తుంచుకోవడంతో పాటు, దానిని కాపాడి భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల్లో దేశం పట్ల బాధ్యత, దేశభక్తి భావనలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో కళా బృందాలు 'హర్ ఘర్ తిరంగా'పై ప్రదర్శించిన యక్షగానం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీ లత, ప్రోగ్రాం ఇన్‌చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీలో ఓరుగల్లు ఫోటో జర్నలిస్టులకు బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డులు






**వరంగల్,ఆగస్టు 11 (సుదీక్ష న్యూస్) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో ఓరుగల్లు ప్రాంతానికి చెందిన ఇద్దరు ఫోటో జర్నలిస్టులు వీరగోని హరీష్, మెరుగు ప్రతాప్లు ప్రతిష్టాత్మకమైన బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో తమ ప్రతిభను చాటుతూ ఈ అవార్డులను సాధించడం పట్ల ఫోటో జర్నలిస్టులలో హర్షం వ్యక్తమవుతోంది. ఆంధ్రజ్యోతి దినపత్రికలో హనుమకొండలో డిప్యూటీ చీఫ్ ఫోటో జర్నలిస్టుగా పనిచేస్తున్న వీరగోని హరీష్, నమస్తే తెలంగాణ దినపత్రికలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫోటో జర్నలిస్టుగా పనిచేస్తున్న మెరుగు ప్రతాప్ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. వార్తా ప్రపంచంలో ఫోటోకు ఉన్న ప్రాధాన్యతను తమ కెమెరా కళ్లతో చాటుతూ, సామాజిక, సాంస్కృతిక, ప్రజా జీవనానికి సంబంధించిన అనేక కీలక ఘట్టాలను చిత్రీకరిస్తూ జర్నలిజంలో తమదైన ముద్ర వేసుకున్న వీరిద్దరికి జాతీయ స్థాయి గుర్తింపు లభించడం అభినందనీయమని తోటి జర్నలిస్టులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు, వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు హరీష్, ప్రతాప్‌లను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కెమెరా కంటితో సమాజాన్ని ఆవిష్కరిస్తూ.. ఓరుగల్లుకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన హరీష్, ప్రతాప్‌లకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి CAMPA నిధులు మంజూరు చేయాలి

- ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లకు త్వరగా అనుమతులు ఇవ్వాలి
- జంతువుల కదలికలపై వీడియో, ఆడియో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి
- కేంద్ర జూ అథారిటీని కోరిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (సుదీక్ష న్యూస్):** హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (CAMPA) నిధులు మంజూరు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య కోరారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా జూలాజికల్ పార్క్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఎంపీ కేంద్ర జూ అథారిటీ దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాకతీయ జూలాజికల్ పార్కులో జంతువుల సంరక్షణతో పాటు మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధి, పార్కు విస్తరణకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఎన్‌క్లోజర్లకు త్వరగా అనుమతులు



కాకతీయ జూలాజికల్ పార్కులో సింహాల ఎన్‌క్లోజర్, నైట్ షెల్టర్‌తో పాటు హైనా, జాకల్, వైల్డ్‌డాగ్ ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లు, సరీసృపాల ఎన్‌క్లోజర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ అటవీ శాఖ ఇప్పటికే కేంద్ర జూ అథారిటీకి సమర్పించిందని కడియం కావ్య తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు ప్రతిపాదనల్లో సవరణలు చేసి డిజైన్లు, డ్రాయింగ్‌లు కూడా సమర్పించినందున వాటికి త్వరగా ఆమోదం మంజూరు చేయాలని కోరారు. ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్ల నిర్మాణం పూర్తయితే జంతువులకు మరింత మెరుగైన సంరక్షణ, భద్రత కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

జంతువుల కదలికలు, ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ వాటి సంరక్షణ, భద్రతను పర్యవేక్షించేందుకు వీడియో, ఆడియో రికార్డింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎంపీ సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా జంతువుల ఆరోగ్యం, ప్రవర్తన, భద్రతను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని తెలిపారు. నిధులను విడుదల చేసి జూలాజికల్ పార్కులో అవసరమైన అభివృద్ధి పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర జూ అథారిటీని కోరారు.

### ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి

కాకతీయ జూలాజికల్ పార్కును వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ విద్య, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కడియం కావ్య పేర్కొన్నారు. పార్కును అన్ని హంగులతో అభివృద్ధి చేస్తే వరంగల్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.
దీంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా మెరుగుపడతాయని ఎంపీ తెలిపారు. కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి కేంద్ర స్థాయిలో అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఎంపీ డా. కడియం కావ్య చేసిన విజ్ఞప్తులపై కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు ఎంపీ వెల్లడించారు.

# తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులకు గుర్తింపు, గౌరవం, సంక్షేమం కల్పించాలి

- ఎమ్మెల్సీ కోదండరామ్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమ నాయకుల వినతి

**హైదరాబాద్, ఆగస్టు 11 (సుదీక్ష న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలి దశ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు ఎమ్మెల్సీ కోదండరామ్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను, సమయాన్ని, కుటుంబాలను సైతం త్యాగం చేసి ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.





### ఉద్యమకారుల సేవలకు గుర్తింపు ఇవ్వాలి

ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రావు అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. అమరవీరుల ఆశయ సాధనే ప్రతి తెలంగాణ బిడ్డ లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న తొలి, మలి దశ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమకారుల సేవలను గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించడంతో పాటు వారి కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఉద్యమకారుల హక్కులను పరిరక్షించాలి

కో-కన్వీనర్ రేపల్లె శ్రీనాథ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన మలి దశ ఉద్యమకారుల హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గుర్తింపు, గౌరవం, సంక్షేమ పథకాలు కల్పించి వారి హక్కులకు రక్షణ కల్పించాలని కోరారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి వివరాలను పారదర్శకంగా నమోదు చేసి, అర్హులైన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల గుర్తింపు విషయంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా, ఉద్యమంలో ప్రతి ఒక్కరి పాత్రను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మలి దశ ఉద్యమ నాయకులు చీఫ్ అడ్వైజర్ మట రాజశేఖర్ రెడ్డి, అడ్వై జర్ రషీద్‌తో పాటు పలువురు ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట.. జనసేనలోకి భారీగా వలసలు

వరంగల్ జనసేన నాయకుడు కరాటే ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు

**వరంగల్, ఆగస్టు 11 (సుదీక్ష న్యూస్):** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడు ముక్కలాటగా మారిం దని వరంగల్ జనసేన పార్టీ నాయకుడు కరాటే ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో పదవులను సినిమా టికెట్ల మాదిరిగా 'నీకు ఒకటి నాకు ఒకటి' అంటూ పంచుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం వరంగల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కరాటే ప్రభాకర్ మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేశానని తెలిపారు. పార్టీ అధికారంలో లేని సమయంలోనూ ఎన్నో ఇబ్బందులు, ఒత్తిళ్లు ఎదుర్కొంటూ పార్టీ కోసం పనిచేశానని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత విభేదాలతో మూడు ముక్కలాటగా మారిపోయిందని ఆయన అన్నారు. జిల్లా అధ్యక్షుడికి పదవి ఇచ్చినప్పటికీ కనీస గౌరవం, గుర్తింపు లేకుండా కొందరు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వరంగల్



తూర్పులో వచ్చిన పార్టీ పదవులను 'నీకు ఒకటి.. నాకు ఒకటి' అంటూ సినిమా టికెట్ల మాదిరిగా పంచుకుంటున్నారని ప్రభాకర్ విమర్శించారు. తనను కూడా అనేక విధాలుగా ఒత్తిళ్లకు గురిచేశారని తెలిపారు.

### జనసేనలోకి పలువురు రానున్నారు

రానున్న రోజుల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలోకి చేరనున్నారని కరాటే ప్రభాకర్ తెలిపారు. జనసేన పార్టీలోకి తాను పవన్ కళ్యాణ్ కోసం మాత్రమే రాలేదని, పేద ప్రజలకు మంచి చేయాలనే పవన్ కళ్యాణ్ దృక్పథం నచ్చి పార్టీలో చేరానని చెప్పారు. జనసేన అధిష్టానం తనకు అప్పగించే బాధ్యతలకు అనుగుణంగా పనిచేస్తూ పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తానని కరాటే ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం కోసం జనసేన తరఫున తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నేటి సుదీక్ష
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

# చలివాగు నుంచి సాగు నీరందించాలి రైతులతో కలిసి మాజీ
## ఎమ్మెల్యే గండ్ర ధర్నా గంటపాటు స్తంభించిన రాకపోకలు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా:** చలివాగు ప్రాజెక్టు నుంచి రైతులకు సాగు నీరందించాలని డిమాండ్ చేస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలంలో గల రూపిరెడ్డిపల్లి వద్ద పరకాల జాతీయ రహదారిపై భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. చలివాగు ప్రాజెక్టు నుంచి వెంటనే రైతులకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తయిన ఇప్పటి వరకు చలివాగు ప్రాజెక్టుకు సాగునీరు అందించకపోవడంతో రైతులు వరినారు సాగు చేయలేని దుస్థితి నెలకొందని, వందలాది మంది రైతులు సాగునీటి కోసం తండ్లాడుతున్నారన్నారు.

ఇప్పటికైనా ఈ కసాయి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల బాధలు తెలుసుకొని వెంటనే రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై రైతులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించడంతో సుమారు గంటపాటు రాక పోకలు స్తంభించిపోయాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలే మట్టి దందా యంత్రాలతో యథేచ్ఛగా
## తవ్వకాలు మామూళ్ల మత్తులో అధికారులు



**మాగనూరు :** నారాయణపేట జిల్లా మాగనూరు మండల పరిధిలోని నల్లగట్టు శివారులో పట్టపగలే భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి టిప్పర్లలో తరలిస్తున్న దృశ్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాలకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారా తవ్విన మట్టిని తరలించేందుకు రవాణా అనుమతులు ఉన్నాయా అనే అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు. మైనర్ మినరల్స్ తవ్వకం, రవాణా, అక్రమ క్వారీయింగ్‌ను అరికట్టాల్సిన బాధ్యత మైనింగ్ శాఖపై ఉందని వారు గుర్తుచేస్తున్నారుగత కొన్ని నెలలుగా మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాల్లో రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి అడ్డంకులు లేకుండా ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు తిరుగుతుండటంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుండానే ఇంత బహిరంగంగా తవ్వకాలు ఎలా కొనసాగుతున్నాయని ప్రశ్నిస్తున్నారు.

**భారీ గోతులతో ప్రమాదం**

అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపడితే భూమి స్వరూపం దెబ్బతినడంతోపాటు భారీ గోతులు ఏర్పడి వర్షాకాలంలో ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణంపై పడే ప్రభావాన్ని కూడా అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు.

మట్టి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా అనే విషయంపై కృష్ణ తహసీల్దార్ శ్రీనివాసులను వివరణ కోరగా.. ప్రస్తుతం మూడు రోజుల సెలవులు ఉన్నాయని, ఇప్పటి వరకు ఎవరికీ మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. దీంతో నల్లగట్టు శివారులో జరుగుతున్న తవ్వకాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పూడ్చిపెట్టిన పసికందు మృతదేహం
## మాయం పోలీసుల విచారణ




**హైదరాబాద్:** నగరంలోని పంజాగుట్ట శ్మశానవాటికలో పసికందు మృతదేహం మాయం కలకలం రేపుతోంది. శ్మశానవాటికలో పూడ్చిపెట్టిన ఆరు నెలల పసికందు మృతదేహం అదృశ్యమైంది. చార్మినార్ ఘాన్సీబజార్‌కు చెందిన దంపతులకు ఆరు నెలల క్రితం కవలలు పుట్టారు. అనారోగ్యంతో బాధపడుతున్న కవలలకు బంజారాహిల్స్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ గత శనివారం ఓ పసికందు మృతి చెందింది. దీంతో కుటుంబసభ్యులు.. పంజాగుట్ట హిందూ శ్మశానవాటికలో మృతదేహాన్ని ఖననం చేశారు. మరో చిన్నారి కూడా ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందింది. నిన్న రెండో పసికందు అంత్యక్రియల కోసం కుటుంబసభ్యులు శ్మశానవాటికకు వచ్చారు. ఈ క్రమంలో మొదటి చిన్నారిని పూడ్చిన ప్రాంతంలో గుంత తీసి ఉండటాన్ని గుర్తించారు. గోతిలో మృతదేహం కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు షాక్‌కు గురయ్యారు. రెండో పసికందు అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం.. ఈ వ్యవహారంపై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్మశానవాటిక కాటికాపరులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే ఈ విషయాన్ని బంజారాహిల్స్ పోలీసులు గోప్యంగా ఉంచడం చర్చనీయాంశంగా మారింది.

# జీఆర్ఎంబీలో జరిగే మీటింగ్‌ను బాయ్‌కాట్
## చేయకపోతే జలసౌధను ముట్టడిస్తాం కేటీఆర్



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆనాడు కేసీఆర్ నాయకత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతిచ్చిందే మీ కేంద్ర ప్రభుత్వం.. 7 ప్రాజెక్టులకు ఆనాడు మేము కష్టపడి అనుమతులు సాధించిన తర్వాత ఇవాళ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టుబడితే జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టారు. మీకు రేషం, పౌరుషం ఉంటే ఆ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయండి.. అని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ విషయమై కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. అసలు బీజేపీ సిగ్గుంటే మీరిచ్చిన అనుమతులు మీరురద్దు చేయాలని మీ పార్ట్‌నర్ ఎవరైతే అడుగుతున్నారో.. ఎందుకు రద్దు చేయాలని వారిని ప్రశ్నించండి.. కేంద్ర ప్రభుత్వమే అనుమతిచ్చి కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉండే జీఆర్ఎంబీని రద్దు చేయాలని అజెండాలో పెడుతుంటే సిగ్గులేకుండా మాట్లాడటానికి బీజేపీవాళ్లకు ఏరకంగా మనసు వస్తుందో.. ఏ రకంగా నోరు వస్తుందో నాకైతే అర్థం కావడం లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు.. వీటి ఆధారంగా జరిగిన ఉద్యమమే తెలంగాణ ఉద్యమం. అలాంటి ఉద్యమంలో మేం రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా బ్రహ్మాండంగా రాష్ట్రం సాధించిన తర్వాత ఒక్కో నీటి బొట్టును ఒడిసిపట్టి తెలంగాణ బీడు భూములకు మలిపే ప్రయత్నం చేసినం. అది కాళేశ్వరం, సీతారామ, పాలమూరు-రంగారెడ్డి అయితేనేమీ.. ఇంకా చనాకా-కొరాట లాంటి చిన్న ప్రాజెక్టులు చాలా ఉన్నాయి. అలాంటి అన్నీ ప్రాజెక్టులు వాటితోపాటు మిషన్‌కాకతీయ ప్రాజెక్టులన్నీ చేసి తెలంగాణ నీటి వనరులకు పెద్ద ఎత్తున న్యాయం జరిగే విధంగా, నీటి వనరులను కాపాడుకునే విధంగా మేం ప్రయత్నం చేశాం. అందులో భాగంగా అనుమతులు తెచ్చాం. ఇవాళ ఆ అనుమతులన్నింటిని తుంగలో తొక్కుతం. మా చెప్పు చేతల్లో కేంద్రప్రభుత్వం ఉంది.. కేంద్రం జుట్టు నా చేతుల్లో ఉంది కాబట్టి నేను ఆడించినట్టే ఆడాలని చంద్రబాబు నాయుడు అనుకుంటే పోరాటం చేసేందుకు మేం సిద్దంగా ఉన్నామన్నారు. చంద్రబాబునాయుడుకు, ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. మా నాయకుడు కేసీఆర్ బేసిన్లు లేవు.. బేషజాలు లేవు నీళ్లు వాడుకుందామని ఎప్పుడో చెప్పారు. కానీ మా కడుపు కొట్టి మా ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తామంటే ఊరుకోం. మీరు పోలవరం కట్టుకుంటే మేమేం అనలేదు కదా.. మీరు పట్టి సీమ నీళ్లు లిఫ్ట్ చేసుకుంటుంటే మేమేం అనలేదు. మాకొచ్చిన అనుమతులను చెడగొట్టకండి అని మేం అంటున్నం. కేంద్రప్రభుత్వం నా చెప్పుచేతల్లో ఉంది.. నేను ఆడిచ్చినట్టు ఆడే చెంచాగాడు తెలంగాణ ముఖ్యమంత్రి ఇక్కడున్నడు కదా.. అని అనుకుంటే తెలంగాణ రైతుల తరపున పోరాటమ చేసేందుకు మేం సిద్దంగా ఉన్నామన్నారు. జలసౌధలో జరిగే మీటింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం బాయ్‌కాట్ చేయకపోతే.. ఎజెండా మార్చి ఈ 7 ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే అంశాలను తొలగించకపోతే తెలంగాణలో తప్పకుండా జల ఉద్యమం నిర్మాణం చేస్తామని చెప్పాం. ఆ రోజు జలసౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి కేసులో
## నలుగురి అరెస్ట్ నార్సింగి ఎస్ఐ




**హైదరాబాద్:** హైదర్ షాకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి కేసులో నలుగురిని అరెస్ట్ చేశామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రమాదానికి కారణమైన కారు ఓనర్ శంషాబాద్‌కు చెందిన క్రాంతి గౌడ్‌గా గుర్తించినట్లు తెలిపారు. మంగళవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ.. హైదర్ షా కోటలోని తన అత్తగారింటికి బోనాల పండుగ సందర్భంగా అతడు వచ్చారని చెప్పారు. తన బావమరిది వికాస్ గౌడ్‌తో కలిసి పార్టీ చేసుకున్నారని అన్నారు. అనంతరం తెల్లవారుజామున టిఫిన్ చేద్దామని లంగర్ హౌస్ వైపు వారంతా కారులో అతి వేగంగా బయలుదేరారని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే రిటైర్డ్ ఆర్మీ జవాన్ రవీందర్‌తోపాటు బైక్‌ను కారుతో ఢీకొట్టారని తెలిపారు. అయితే రవీందర్ అక్కడికక్కడే మరణించగా.. బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని చెప్పారు. ఈ కేసులో పట్టుబడిన నలుగురికి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేశామన్నారు. వీరంతా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయిందన్నారు. అలాగే వీరికి డ్రగ్స్ పరీక్షలు కూడా నిర్వహించగా.. నెగిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వీరిపై 204 పార్ట్ 4 ఐపీసీతోపాటు మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి అమాయకుల ప్రాణాలు తీయొద్దని ప్రజలకు నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సోమవారం తెల్లవారుజామున హైదర్ షాకోట్ ఎస్ఎంపీ స్కూల్ సమీపంలో మహేంద్ర ఎస్‌యూవీ 350 కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన వెళ్తున్న పాదచారులపైకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రవీందర్ గాలిలోకి ఎగిరిపడి అక్కడికక్కడే మరణించారు. అనంతరం బైక్ మీదకు కారు వెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ తర్వాత కారులో వారంతా పరారీ అవుదామనుకున్నారు. కానీ కారు ముందుకు కదల్లేదు. దీంతో కారు వదిలి వారంతా అక్కడి నుంచి పరారైయ్యారు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. రవీంద్ర మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీ టీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. నిందితులను అరెస్ట్ చేశారు. కారు రాంగ్ రూట్‌లో రావడంతోపాటు వారంతా మద్యం తాగి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# గుడిమల్కాపూర్‌లో బాలుడిపై తండ్రి దాడి ఘటన
## చికిత్స పొందుతూ చిన్నారి మృతి



**హైదరాబాద్ :** గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కన్నతండ్రి దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. ఇటీవల పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 104 సమీపంలో తండ్రి సల్మాన్.. కన్న కొడుకు అర్మాన్‌ను పిల్లర్‌కు గుద్ది నేల మీద పడేశాడు. ఆపై డీసీఎం వాహనం కిందకు తోసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు.. బాలుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా కొడుకు పట్ల తండ్రి ఇంతటి దారుణానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ బాలుడు అర్మాన్ మృతిచెందాడు. భార్యతో గొడవ జరుగుతున్న సమయంలో బాలుడిపై దాడి చేసినట్లు సమాచారం. బాలుడి మృతితో హత్య కేసుగా మారుస్తూ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# తెలంగాణలో తగ్గుతున్న
## ప్రభుత్వ స్కూళ్ల సంఖ్య

**హైదరాబాద్:** తెలంగాణలో ప్రభుత్వ స్కూళ్ల సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. గడిచిన ఏడాదితో పోలిస్తే.. 2025-26 సంవత్సరంలో 1969 ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయి. మరో వైపు ప్రైవేటు స్కూళ్ల సంఖ్య మాత్రం రాష్ట్రంలో పెరుగుతున్నట్లు తెలిసింది. ఇదే వార్షిక సంవత్సరంలో రాష్ట్రంలో 771 ప్రైవేటు స్కూళ్ల సంఖ్య పెరిగినట్లు విద్యాశాఖకు చెందిన యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ డేటా ద్వారా వెల్లడైంది. గత పదేళ్లలో తెలంగాణలో యూడీఐఎస్ఈ ప్లస్ డేటా ప్రకారం ప్రైవేటు స్కూళ్ల సంఖ్య 41 శాతం పెరిగింది. వీటిల్లో విద్యార్థుల ఎన్‌రోల్మెంట్ 64.5 శాతంగా ఉన్నట్లు తెలిసింది.

మరో వైపు ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల నమోదు ప్రక్రియ క్షీణించింది. ఎన్‌రోల్మెంట్ 8 శాతం తగ్గినట్లు డేటా ప్రకారం తెలుస్తోంది. ప్రైవేటు స్కూళ్లు పేరెంట్స్, విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. మూతపడినట్లు తెలుస్తోంది.

# బాల్టిమోర్‌లో ఘనంగా
## ముగిసిన ఆటా మహాసభలు



**బాల్టిమోర్ :** అమెరికన్ తెలుగు అసోసియేషన్ 19వ మహాసభలు, యువజన సదస్సు దిగ్విజయంగా ముగిశాయి. అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం, బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు (జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు) ఘనంగా జరిగాయి. ఉత్తర అమెరికాలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా ప్రపంచ నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన తెలుగు ప్రజలతో బాల్టిమోర్ నగరం ఒక మినీ తెలుగు సీమను తలపించింది. తెలుగు భాషాభిమానం, సామాజిక ఐక్యత, ఆర్థిక పురోగతి, భావితరాల చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఈ మహాసభలు 'సూపర్ డూపర్ హిట్' అని ఈ సమావేశాలకు హాజరైన ప్రతినిధులు అభివర్ణించారు. ఆటా చరిత్రలోనే ఈ వేడుకలు ఒక చిరస్మరణీయ మైలురాయిగా నిలిచాయని వక్తలు కొనియాడారు.

ఈ మహాసభలకు అమెరికా జాతీయ రాజకీయ దిగ్గజాలతో పాటు భారతదేశానికి చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. మేరీల్యాండ్ గవర్నర్ వెస్‌మూర్ మాట్లాడుతూ.. మేరీల్యాండ్, అమెరికా సమగ్ర అభివృద్ధిలో తెలుగు ప్రవాసుల పాత్రను కొనియాడారు. సాంకేతికత, వైద్యం, విద్య, వ్యాపారం, పౌర సేవల్లో తెలుగు వారి నిబద్ధతను అభినందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్ అరుణా మిల్లర్ మాట్లాడుతూ.. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా అమెరికన్ సమాజంలో ఉన్నత అవకాశాలను సాధించవచ్చని సూచించారు.

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ గజాలా ఎఫ్ హష్మీ తన హైదరాబాద్ జ్ఞాపకాలైన పాతబస్తీ, చార్మినార్, లాడ్ బజార్, హైదరాబాదీ బిర్యానీ, రైలు ప్రయాణాలను వివరించడంతో ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. ప్రవాసులు పౌర, రాజకీయ ప్రక్రియల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలంగాణ రాష్ట్ర ప్రగతి, మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలను వివరిస్తూ రాష్ట్రాభివృద్ధికి, ఉపాధి కల్పనకు ప్రవాస పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజ ఐక్యతను చాటారు

# పళ్ల బురుసు సందేశాత్మక చిత్రం



'పళ్ళ బురుసు' లాంటి మంచి సందేశాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు నిర్మాత సుప్రియ యార్లగడ్డ. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్, గోమతి రెడ్డి ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాని ఉదయ్ చౌహాన్ తెరకెక్కించారు. ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుప్రియ మాట్లాడుతూ.. ఏఎన్నార్ ఉండిఉంటే మంచి చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు ప్రశంసించేవారని అన్నారు. 'అందరూ ఎంతో ప్రేమించి తీసిన సినిమా 'పళ్ళ బురుసు'. దీన్ని చూస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అదే సమయంలో కన్నీళ్లొచ్చాయి. మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా అనిపించిందని నాగార్జున అన్నారు. . ఆయన అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై మరో నిర్మాత వివేక్ కృష్ణపాణితో కలిసి నిర్మించిన చిత్రమే 'పళ్ళ బురుసు'. అన్నపూర్ణ స్టూడియోస్ 50ఏళ్లు పూర్తి చేసుకుంది. నాన్న ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో చక్కటి సినిమాలు చేశాం. ఈ 50వ సంవత్సరం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నాం. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూషన్‌ని విస్తరించాం. ఇక ఈ చిత్ర విషయానికొస్తే.. తల్లిదండ్రుల్ని మనం చూసుకున్న దానికన్నా అదృష్టం ఇంకేదీ ఉండదు. అది చాలా ముఖ్యం. అలా నా తల్లిదండ్రుల్ని నేను చూసుకున్నా. ఇప్పటికీ అమల కూడా వాళ్ల అమ్మానాన్నల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. ఇందులో శంభు తాతగా సుధాకర్ అద్భుతంగా చేశారు. తన కొడుకు పాత్రలో మురళీధర్ చక్కగా నటించారు. ఈ నెల 14న మా అమ్మ పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ చిత్రంపై ఉంటాయని నా నమ్మకం అన్నారు. కుటుంబంతో కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరి మనసుల్ని హత్తుకుంటుంది' అన్నారు దర్శకుడు ఉదయ్. ఈ కార్యక్రమంలో సుప్రియ యార్లగడ్డ, మురళీధర్ గౌడ్, సుధాకర్, గోమతి, పవన్ సీహెచ్, ప్రసాద్, సురేశ్ గంగుల, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

----



# మోహన్ లాల్ కుమార్తె విస్మయ

## తుడక్కం మూవీతో అరంగేట్రం

మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ . జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్‌లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ దీనికి మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ. 2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ. 6.63 కోట్ల) ప్రపంచ వ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది. విస్మయ మోహన్‌లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం. 'మీను' పాత్రలో విస్మయ ఎంతో సహజంగా నటించగా, ఆశిష్ సైకో పాత్రలో తన నటనతో భయపెట్టారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, లైంగిక దాడులు, మనుగడ కోసం ఒక యువతి చేసే పోరాటం నేపథ్యంలో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# శబరిమలకు సంబంధం లేని ఇరుముడి

## దర్శకుడు శివ నిర్వాణ స్పష్టీకరణ




రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ ఫ్యామిలీ అండ్ డివోషనల్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా పాటల్లో, టీజర్‌లో రవితేజ అయ్యప్ప మాలలో కనిపించారు. దీంతో ఈ చిత్ర కథపై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తున్నాయి. శబరిమల బ్యాక్‌డ్రాప్‌లో ఇది రానుందని ప్రచారం మొదలైంది. తాజాగా దీనిపై దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. శబరిమల దేవాలయానికి ఈ సినిమాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కథకు శబరిమలతో ఎలాంటి సంబంధం లేదు. సినిమాలో కథానాయకుడి జీవితంలో 41 రోజుల అయ్యప్ప దీక్ష ఒక భాగం మాత్రమే. దీక్షా కాలంలో అయ్యప్ప భక్తులు తమ నియమావళి, అలవాట్ల విషయంలో చాలా నిష్టగా ఉంటారు. వ్యసనాలు ఉన్న ఒక వ్యక్తి ఈ దీక్ష తీసుకోవాల్సి వస్తే.. అతడు మద్యానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. అక్కడే కథలో అసలైన సంఘర్షణ మొదలవుతుంది. కఠినమైన నియమాలు ఉండాలి కాబట్టే నేను అయ్యప్ప స్వామి దీక్ష నేపథ్యాన్ని ఎంచుకున్నాను. అంతే తప్ప ఇది శబరిమలకు సంబంధించిన కథ కాదని ఆయన పేర్కొన్నారు ఈ 41 రోజుల కథే స్క్రీన్‌ప్లేకి ప్రధాన బలంగా నిలుస్తుంది. అది సినిమాను మరింత ఆసక్తికరంగా మారుస్తుంది. ఆ దీక్షకు ముందు ఏం జరిగింది.. దీక్షలో ఉన్న సమయంలో ఏం జరిగిందనే విషయాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయని శివ నిర్వాణ తెలిపారు. రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తున్న ఈ సినిమా ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది

-------

# రుక్మిణీ వసంత్ మలయాళ ఎంట్రీ..



ఒక్క సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నారు అంటే అది హీరోకైనా, హీరోయిన్ కైనా వరుసగా అవకాశాలు వచ్చి పడతాయి. అందులో భాగంగానే మరీ ముఖ్యంగా ఈ మధ్యకాలంలో యంగ్ హీరోయిన్స్ తమ అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. అలాంటి వారిలో రుక్మిణి వసంత్ కూడా ఒకరు. సప్త సాగరాలు దాచేయెల్లో అనే సినిమాతో వెండితెరకు పరిచయమైన రుక్మిణీ వసంత్.. తెలుగులో తొలిసారి నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. అయితే ఈ సినిమా పెద్దగా విజయాన్ని అందుకోలేదు. ఆ తర్వాత తమిళ్ లో శివ కార్తికేయన్ సరసన మదరాసి అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా సక్సెస్ కాలేదు. అయితే ఈ సినిమా ప్రమోషన్స్ సమయంలో డైరెక్టర్ ఈమెకు ఇచ్చిన ఎలివేషన్ కారణంగా ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చింది రుక్మిణి వసంత్. సరైన క్యారెక్టర్ పడితే తనను తాను నిరూపించుకోవడానికి ఎప్పుడూ సిద్ధమే అని కాంతారా చాప్టర్ వన్ చిత్రంతో నిరూపించింది. ఇందులో కీలకపాత్ర పోషించిన రుక్మిణి వసంత్.. సినిమా మొత్తం సాఫ్ట్ క్యారెక్టర్ తో ఆకట్టుకొని.. క్లైమాక్స్లో ఒక్కసారిగా విలనిజం కనబరిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. పైగా కొన్ని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టి నే డామినేట్ చేసింది అంటే.. తన నటనతో ఏ విధంగా మెప్పించిందో అర్థం చేసుకోవచ్చు.అలాంటి ఈమె ప్రస్తుతం ప్రముఖ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న డ్రాగన్ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పుడు మరో క్రేజీ ఆఫర్ లభించింది .ఈ విషయాన్ని తన అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకుంది. నివిన్ పౌలీ సరసన హీరోయిన్ గా ఛాన్స్ కొట్టేసి.. మాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యింది. అందులో భాగంగానే ఈమె ఆన్ సెట్ కి వెళ్లిన సందర్భంగా క్లాప్ బోర్డు పట్టుకొని ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. మొత్తానికి అయితే రుక్మిణి వసంత్ మాలీవుడ్ లోకి అడుగుపెట్టడంతో అభిమానులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే తాను ఎంతో కాలంగా అభిమానిస్తున్న మాలీవుడ్ సినీ పరిశ్రమలో అవకాశం లభించడంతో తనకు చాలా ప్రత్యేకంగా అనిపిస్తుంది అంటూ రుక్మిణి చెప్పుకొచ్చింది. ఆ ప్రపంచంలో ఒక చిన్న స్థానం సంపాదించడం తనకు ఒక ముఖ్యమైన తొలి అడుగు అని , ఈ ప్రాజెక్టులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి కూడా ధన్యవాదాలు తెలిపింది. ఈ సినిమాలో నివిన్ పౌలీ హీరోగా నటించడమే కాకుండా తన సొంత బ్యానర్ అయిన పౌలీ జూనియర్ పిక్చర్స్ బ్యానర్ పై మార్టిన్ ప్రాక్కాట్ ఫిలిమ్స్ తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో మలయాళ నటుడు అజు వర్గీస్ కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో తమలయాల సూపర్ హిట్ కామెడీ మూవీ జయ జయ జయ జయ హే అనే చిత్రానికి సహా రచయితగా పనిచేసిన నషీద్ ఫామీ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు.





# టాక్సిక్ రన్‌టైమ్ పై ఆసక్తికర ప్రచారం

ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో



'టాక్సిక్ ఒకటి. యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'టాక్సిక్' రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. గీతూమోహన్ దాస్ తన కథపై నమ్మకంతోనే ఈ నిడివితో సెన్సార్‌కు పంపారని సమాచారం. ఈ సినిమాను ప్రైమ్ బిగ్ స్క్రీన్ ఫార్మాట్ అయిన ఐమాక్స్‌లో కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. కన్నడ ఇండస్టీ నుంచి ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతోన్న రెండో సినిమా ఇది కాగా.. రెండు ఐమాక్స్ చిత్రాలను (కేజీఎఫ్ 2, టాక్సిక్) తన ఖాతాలో వేసుకున్న ఏకైక కన్నడ స్టార్‌గా యశ్ రికార్డు సృష్టించారు. త్వరలోనే దేశవ్యాప్తంగా ఐమాక్స్ బుకింగ్స్ కూడా ప్రారంభం కానున్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

---------------




# కలెక్షన్లలో కనకరాజు దూకుడు

మెగాహీరో వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా మొదటి వీకెండ్‌లోనే సుమారు రూ. 37 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇక వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చిన మొదటి వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. కఠినమైన 'మండే టెస్ట్'ను ఈ చిత్రం చాలా విజయవంతంగా పాస్ అయింది. విడుదలైన నాలుగో రోజు అయిన సోమవారం ఒక్కరోజే బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవ్వడం విశేషం. దీనివల్ల మొదటి వారపు రోజుల్లోనూ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని స్పష్టమవుతోంది. ఇలాగే కలెక్షన్స్ కొనసాగితే రాబోయే రోజుల్లోనూ థియేటర్లలో ఈ చిత్రం హవా మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇదిలాఉంటే, ఈ సినిమా ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.